688) గుజ్జరి

ప॥ ఇతని మఱచితిమి యెదుటనే యుండగ యిన్నాళ్ళును నేమెరగక।
ప్రతిలేదితనికి జీవకోట్లకు ప్రాణబంధుడితడు॥

చ॥ ముందు నేను ఘనగర్భనరకమున మునిగియున్ననాడు।
బొందితోడనే సుఖదుఃఖంబుల బొరయు తోడునీడితడు।
అందిస్వర్గనరకాదులు చొచ్చిన అక్కడ దావెనువెంటనే।
చందపునాయాతుమలో బాయనిసర్వాత్మకుడితడే॥

చ॥ ఆనిపట్టి నే బాపపుణ్యములు అనుభవించవలెనన్నప్పుడు।
మానుపనొల్లడు తా బెరరేచును మతి కనుకూలంబితడు।
నానావిధులను బొరలి యలపుతో నలి నే నిద్రించేటప్పుడు।
తానును ఆపరిమాణంబులకు తగులైవుండును యీతడు॥

చ॥ తలచిన దగ్గరు దడవకయుండిన దవ్వయివుండు నితడు।
కలసి మెలసి ఇహపరము లొసంగగ గాచుకవుండును యీతడు।
మెలగుచు సాకారముతో నున్నాడు మేటిశ్రీవేంకటపతి యితడు।
వలసిన వావులచూపులు దాల్చినవా డొకడేపో యీతడు॥